

# సూర్య

తెలుగు దినపత్రిక

19 వ వసంతంలోకి ...

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం,9 జనవరి 2026 | 8 పేజీలు


## ముమ్మిడివరంలో

# 'ఇసుక' అరాచకం



అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక

- అనుమతులు లేవు..
- దోపిడీకి అడ్డులేదు!
- కోనసీమ నదీ తీరాల్లో మాఫియా పంజా..
- అధికార పార్టీ నేత కనుసన్నల్లో అక్రమ దందా?
- అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

ముమ్మిడివరం నియోజకవర్గంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. నిబంధనలను తుంగలో తొక్కి, నదీ గర్భాన్ని గుల్ల చేస్తూ అక్రమార్కులు కోట్లు గడిస్తున్నారు. తాళ్లరేవు, ఐ.పోలవరం మండలాల పరిధిలోని నదీపాయలు ఇప్పుడు అక్రమ తవ్వకాలకు అడ్డాగా మారాయి. రాత్రికి రాత్రే నది కడుపు చీల్చి, పడవల ద్వారా తీరానికి చేర్చి, ట్రాక్టర్లతో గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను తరలిస్తున్నారు.

**ప్రధానాంశాలు :**

- **ప్రాంతాలు** : పిల్లంక, గోవలంక, సీతారామపురం, పశువుల్లంక, ఎదుర్లంక.
- **ప్రధాన నిందితుడు:** టి.కొత్తపల్లికి చెందిన ఓఅధికారపార్టీ కీలక నేతపై ఆరోపణలు.
- **విధానం:** రాత్రి వేళల్లో పడవల ద్వారా తరలింపు, అనధికార రీచ్‌ల ఏర్పాటు.
- **ప్రమాదం:** అగాధాల వల్ల గత ఏడాది నలుగురు యువకులు మృతి, మళ్లీ పొంచి ఉన్న ముప్పు.



అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక



అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక

**బాహాటంగానే దోపిడీ..**
**ప్రజాప్రతినిధి ఫొటోతో ఫ్లెక్సీలు!**

ఈఅక్రమదందాఎంత తెగించిందంటే ,ఇసుకను అక్రమంగా డంపింగ్ చేసే చోట ఏకంగా ఒక ప్రజాప్రతినిధి ఫొటోతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అంటే, మా వెనుక 'పెద్దలు' ఉన్నారనే సంకేతాన్ని ఇస్తూ యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు.

- తరువాయి 2లో..



అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక

## సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోపి పోటీలలో విజయవంతం చేయాలి





**- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోపీ పడవ,ఈత తదితర పోటీలకు పటిష్టమైన ఏర్పాటు చేస్తున్నట్లు, పోటీలు విజయవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారుసత్యానందరావు అన్నారు. ఆత్రేయపురంలో జనవరి 11,12,13వ తేదీల్లో జరగనున్న సంక్రాంతి సంబరాలు డ్రాగన్ పడవల పోటీల ఏర్పాట్లను ఎమ్మెల్యే గురువారం ఆర్డీవో పి.శ్రీకర్,ఆకుల రామకృష్ణ, టూరిజం అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా లొల్ల లాకుల వద్ద ఏర్పాటు చేయనున్న ఫుడ్ ఫెస్టివల్ ప్రాంతాన్నిఅనంతరం పడవల పోటీలు నిర్వహించనున్న ప్రదేశాన్ని తదితర ప్రాంతాలను పరిశీలించారు. ప్రఖ్యాత సింగర్స్‌తో మ్యూజికల్ ప్రోగ్రామ్ నిర్వహించనున్న ఆత్రేయపురం మహాత్మా గాంధీ కళాశాలగ్రౌండ్స్‌లో ఏర్పాట్లనుపరిశీలించారు .ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు ముందుగా నిర్వహించనున్న ట్రోపీపోటీల సమయందగ్గర పడుతుండటం తో అధికారులు పనులు పూర్తిచేయాలని సూచించారు. పోటీలలో పాల్గొనేవారికి వసతులఏర్పాటు,అలాగే సందర్శన కు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు

- తరువాయి 2లో..

## ఎలక్ట్రికల్ యూనియన్ భవనానికి స్థలం కేటాయించండి..

**-ఎమ్మెల్యే శిరీష దేవికి వినతి**



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** ఎలక్ట్రికల్ యూనియన్ కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలంటూ మండలంలోని ఎలక్ట్రిషియన్స్ యూనియన్ కార్మికులు గురువారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిని కోరి వినతి పత్రం అందజేశారు. వట్టిగడ్డ గ్రామంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద కార్మికులు ఎమ్మెల్యేను కలసి తమ సమస్యలు వివరించారు. గత దశాబ్దకాలంగా మండలంలో తమ సంఘంలోని సుమారు వందమంది ఎలక్ట్రికల్ కార్మికులు రోజువారి పని చేసుకుని జీవనం సాగిస్తున్నారని వారి నెలవారి సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి సరైన భవనం లేక ఇబ్బంది పడుతున్నారని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రామరాజు తెలిపారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే అధికారులతోమాట్లాడారు. స్థలం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు సిహెచ్ రాంబాబు, నాగేంద్ర, భద్రం కామరాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిప్రపత్తుల మధ్య 'గోవింద' నామస్మరణ..





**ముఖ్యఅతిథులుగాఎమ్మెల్యే పంతం నానాజీ దంపతులు:** ఈ ఆధ్యాత్మిక వేడుకకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ – అరుణ దంపతులు తమ కోడలు శ్రీలేఖతో కలిసి విచ్చేదం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి ఇంటి నందిబాబు, దాతలు ఆకుల రాజబాబు మరియు ఆలయ అర్చకులు వారికి మేళతాళాల మధ్య, పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రాజబాబు దంపతులు ఎమ్మెల్యే దంపతులకు నూతన వస్త్రాలు అందించి ఘనంగా సత్కరించారు.

**వేద మంత్రాల మధ్య ఆధ్యాత్మిక విందు:**ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన పవన్ కుమార్ ఆచార్యులు, వేద పండితుల ఆధ్వర్యంలో ఈ క్రతువు శాస్త్రోక్తంగా సాగింది. ధనుర్మాస విశిష్టతను చాటిచెప్పే తిరుప్పావై పాశురాలను పండితులు శ్రావ్యంగా పఠించారు. స్వామివారికి నిరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులందరికీ వేదాశీర్వచనం అందించారు. అన్నకూటోత్సవంసందర్భంగా స్వామివారికి సమర్పించిన వివిధ రకాల పిండివంటలు భక్తులను ఆకట్టుకున్నాయి.

**అన్నప్రసాద వితరణ–భక్తుల పారవశ్యం:**పూజా కార్యక్రమాల అనంతరం భారీ ఎత్తున ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో శ్రీగోదా గోవింద బృంద సభ్యులు, పెద్దసంఖ్యలోమహిళా భక్తులు పాల్గొని గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. భక్తులందరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా దాతలు మరియు ఆలయ కమిటీ వారు చేసిన ఏర్పాట్లు ప్రశంసనీయం.

### – ఇంద్రపాలెంలో నయనానందకరంగా వేంకటేశ్వరస్వామి అన్నకూటోత్సవం!

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ధనుర్మాస పుణ్య ఘడియలు ముగుస్తున్న తరుణంలో కాకినాడ రూరల్ ఇంద్రపాలెం పరిధిలోని శ్రీదుర్గా వెంకట శివసాయి అయ్యప్ప ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోయింది. లోక కళ్యాణార్థం, ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి స్థానిక భక్తులు ఆకుల రాజబాబు – వేంకటలక్ష్మణరేఖ దంపతులు నిర్వహించిన 'అన్నకూటోత్సవం' అత్యంత వైభవంగా, భక్తుల కోలాహలం మధ్య జరిగింది.

# విద్యార్థులకు చట్టాలపై అవగాహన..

**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ మండల కేంద్రమైన అడ్డతీగలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యుడు తీగల బాబురావు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నేషనల్ లీగల్ సర్వీస్ అథరిటీ ఆదేశాలు మేరకు స్థానిక కాలేజీ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించడం డ్రగ్స్ వల్ల వచ్చే అనర్థాలు ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన వంటి విషయాలపై సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థి దశలో ఉన్న ప్రతి ఒక్కరు పై విషయాలను క్రమంగా తెలుసుకొని భవిష్యత్తులో వాటి జోలికి వెళ్ళకుండా మెరుగైన అవకాశాలు అంది పుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.




# ఛాంబర్స్ ప్రాంగణంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



**పాలకొల్లు,మేజర్ న్యూస్ :** స్థానిక ఛాంబర్స్ విద్యా సంస్థలలో గురువారం ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు విద్యార్థులకు నిర్వహించారు,ఈ పోటీలలో జూనియర్,డిగ్రీ,పీజీ కళాశాలల విద్యార్థులు 175 మంది పాల్గొన్నారు.తెలుగు సంస్కృతిని ఇనుమడింప చేసే విధంగా విద్యార్థినిలు ముగ్గులు వేశారు,ఈ ముగ్గుల పోటీలకు జడ్జీలుగా ఏ విశాల లక్ష్మి , రేపాక శ్రీచిత్ర ,కారుమూరు సబితా ,సింధు ,వ్యవహరించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు మాట్లాడుతూ సంక్రాంతి శోభ ఇంటి ముందు వేసే రంగవల్లుల ద్వారా సంక్రాంతి లక్ష్మికి మన ఆడపడుచులు ఆహ్వానం పలుకుతారని, మన తెలుగు ఇంటి వారంతా అతిపెద్ద పండుగగా సంక్రాంతిని మన రైతులు పాడిమంటలతో సుఖసంతోషాలతోఆనందోత్సవాలు నడుమ పండుగ జరుపుకుంటారన్నారు.

తదుపరిఈముగ్గుల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సిలేషన్ బహుమతులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్,మెడల్స్‌తో సత్కరించారు,ఈ కార్యక్రమంలో పోటీలకు విచ్చేసిన న్యాయ నిర్ణేతులైన కారుమూరి సబిత, సింధు ,కళాశాల ట్రెజరర్ ప్రవీణ్ భాను ,అకాడమిక్ అడ్వైజర్స్ డాక్టర్ ఏబిఎస్ మూర్తి , నందుల సీతారామ రావు,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే బాబ్జి,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి .వెంకటేశ్వరరావు,కళాశాల కల్చరల్ కమిటీ మెంబర్స్ రాధా మాధవి,సత్యవేణి ,నరసమాంబ, రవికుమార్ విజయలక్ష్మి, అంజలి , రంజని, శైలజ జానకి రామయ్య ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## ముమ్మిడివరంలో 'ఇసుక' అరాచకం

టి.కొత్తపల్లికి చెందిన సదరు నేత చక్రం తిప్పుతుండటంతో స్థానిక యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**మృత్యుకూపాలుగా మారుతున్న నదీ తీరాలు**

గత ఏడాది ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన భారీ గోతుల్లో పడి నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఆ చేదు జ్ఞాపకాలు ఇంకా మర్చిపోకముందే, అక్రమార్కులు మళ్లీ అదే స్థాయిలో నదిని తవ్వేస్తున్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో, నదిలోకి దిగే స్థానికులకు ఈ అగాధాలు మృత్యువును పరిచయం చేసే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కమిటీలు ఉన్నా.. కదలని అధికారులు!**

అక్రమ మైనింగ్‌ను అరికట్టడానికి తహసీల్దార్, పోలీస్, ఎంపీడీవో, ఇరిగేషన్, మైనింగ్ శాఖలతో కూడిన ప్రత్యేక కమిటీ ఉన్నప్పటికీ, ముమ్మిడివరంలో అది 'కాగితాలకే' పరిమితమైంది. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో పనిచేయాల్సిన ఈ బృందాలు, కింది స్థాయిలో జరుగుతున్న దోపిడీని ఎందుకు అడ్డుకోవడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. "ముడుపుల మత్తులో కొందరు అధికారులు జోల పాడుతున్నారు" అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

"మా మండలంలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమ తవ్వకాల విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే వీఆర్వోతో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం." – విజయశ్రీ, తహసీల్దార్, ఐ.పోలవరం.

**ప్రజా డిమాండ్:**పచ్చని కోనసీమలో నదీ సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా, నియోజకవర్గవ్యాప్తంగా సాగుతున్న ఈ అక్రమ రీచ్‌లను సీజ్ చేసి, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోపి పోటీలలో విజయవంతం చేయాలి

లేకుండా చర్యలుచేపట్టాలన్నారు.ప్రభుత్వశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయ కులు సమన్వయంతో పనిచేసి ఈ గోదావరి ట్రోపీకార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు,ఎంపీడీవో బి.కే.ఎస్.ఎస్. వెంకట్ రామన్, తాసిల్దార్ రామచంద్రమూర్తి, ఎస్ఐ ఎస్. రాము, మండల తెలుగు యువత అధ్యక్షులు వెచ్చ అనిల్, నాయకులు పిఎస్‌రాజు,జుజవరపుహరిబాబు,మెర్ల శ్రీరామ చంద్ర మూర్తి, నరాల శెట్టి వెంకన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్యం సేవించి న్యూసెన్స్ చేసిన ఇద్దరికి 20 రోజుల జైలుశిక్ష



**భీమడోలు,మేజర్ న్యూస్ :** మండలానికి చెందిన బోడ అర్జున్, గుండు గొలను గ్రామం బోడ విశ్వవర్ధన్ గుండు గొలను గ్రామం అనే ఇద్దరు వ్యక్తులు ఈ నెల 7వ తేదీ రాత్రి సమయంలో మద్యం సేవించి గ్రామంలో గొడవ పడుతూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ న్యూసెన్స్ సృష్టించారని పోలీసులు నమోదు చేసిన కేసులో కోర్టు 20 రోజులు జైలు శిక్ష విధించింది. అదే విధంగా డయల్ 112 కు తప్పుడు కాల్ చేసి, పోలీసుల విలువైన సమయాన్ని వృథ చేసినట్లు ఈ ఘటన నేపథ్యంలో మద్యం సేవించి న్యూసెన్స్ చేసినందుకు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు, ఏలూరు వారి ఎదుట హాజరుపరచగా,న్యాయమూర్తి కే.వి.మహేశ్వరి నిందితులకు 20 రోజుల జైలు శిక్ష విధిస్తూ, జిల్లా జైలుకు పంపుతున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,మద్యం సేవించి ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించడం, డయల్ 112 వంటి అత్యవసర సేవలను దుర్వినియోగం చేయడంచట్ట రీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌కి ఎంపికైన 'ఆదిత్య' విద్యార్థినులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల అనుబంధ సంస్థ అదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రథమ సంవత్సరం చదువుతున్న బిసిఏ విద్యార్థినిలు జి.హరి నాగచంద్రిక, జే.చాందిని లు తమ విద్యా ప్రతిభ, కృషి మరియు నిబద్ధతకు గుర్తింపుగా దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లు సాధించారని, వీరికి సంవత్సరానికి రూ.50,000 చొప్పున మూడు సంవత్సరాలు వస్తాయని, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రోత్సాహం కల్పించాలనే లక్ష్యంతో రిలయన్స్ ఫౌండేషన్ వారు అందించే ఈ స్కాలర్‌షిప్‌ని సాధించడం ఎంతో గౌరవప్రదమైన విషయమని కళాశాల ప్రిన్సిపాల్ డి.బ్యూలా తెలియజేశారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్.నాయుడు మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌కి ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తూ కళాశాలలో అమలు చేస్తున్న నాణ్యమైన బోధనా విధానాలు, మోనిటరింగ్ వ్యవస్థ, నిరంతర అకడమిక్ మద్దతు వల్లే విద్యార్థులు జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌లు సాధించగలుగుతున్నారని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.బ్యూలా మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులను కేవలం పరీక్షలకే పరిమితం చేయకుండా, భవిష్యత్‌లో వృత్తి అవకాశాలు, పోటీ పరీక్షలు స్కాలర్‌షిప్‌లపై కూడా మార్గనిర్దేశం చేస్తున్నామని, రానున్న అకడమిక్‌లో మరింత మంది విద్యార్థులు ఇలాంటి ప్రతిష్టాత్మకమైన స్కాలర్‌షిప్‌లు సాధించేలా ప్రోత్సహిస్తామని, ఎంపికైన విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందిస్తూ వారు విద్యారంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి కళాశాలకు, మంచి గుర్తింపు తీసుకురావాలని తెలియజేశారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ విద్యార్థినులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని అకడమిక్‌తోపాటు వ్యక్తిత్వ వికాసంలో కూడా ముందడుగులు వేయాలని ఆకాంక్షంచారు. వేలాది దరఖాస్తులు మధ్య నుంచి ఎంపిక కావడం విద్యార్థుల కృషికి, వారి అంకిత భావానికి నిదర్శనం అని తెలియజేశారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికి కాకుండా సమాజ నిర్మాణానికి కూడా కీలకమని ఇలాంటి స్కాలర్‌షిప్‌లు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఉన్నత లక్ష్యాలు సాధించే దిశగా ప్రేరణనిస్తాయని, ఇలాంటి ప్రతిష్టాత్మక స్కాలర్‌షిప్‌లకు ఎంపిక అవడం కళాశాలకు ఎంతో గౌరవప్రదమని, విద్యార్థినులను హృదయపూర్వకంగా అభినందించారు. స్కాలర్‌షిప్‌కి ఎంపికైన విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.సత్య మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

**– ప్రారంభించిన దొంతు మంగేశ్వరరావు**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండలం చలంపాలెం గ్రామం నందు మండల స్థాయి క్రికెట్ పోటీలను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెనుబల్లి సాయిబాబు తండ్రి పెనుబల్లి సుబ్బయ్య (లెట్), ఎడ్లపల్లి ప్రసాద్ తండ్రి ఎడ్లపల్లి సోమయ్య జ్ఞాపకార్థంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ క్రికెట్ టోర్నమెంటును వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు గురువారం ప్రారంభించడం జరిగినది. ఈ పోటీలకు పెనుబల్లి సాయిబాబా ప్రథమ బహుమతి 20,116 రూపాయలు, ఎడ్లపల్లి ప్రసాద్ 12,116 రూపాయలు రెండో బహుమతి ఇవ్వడం జరుగుతుంది అని ఈ టోర్నమెంట్ కమిటీ సభ్యులు తెలిపారు. మండల స్థాయిలో జరిగే ఈ పోటీల ప్రారంభానికి తెలుగుదేశం మండల కమిటీ అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, పిఏసిఎస్ చైర్మన్ మాచినేని రాజేష్, తెలుగుదేశం సీనియర్ నాయకులు సంద్ర రఘు, క్రీడాకారులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైఎస్ఆర్సిపి లీగల్ సెల్‌లో నియోజకవర్గానికి పెద్ద పేట



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు రాష్ట్ర లీగల్ సెల్ విభాగంలో కొత్తపేట నియోజకవర్గానికి పెద్దపీట వేశారు. వీరిలో రాష్ట్ర లీగల్ సెల్ జనరల్ సెక్రటరీగా వెలిచేరు గ్రామానికి చెందిన, ప్రస్తుత రావులపాలెం నివాసి అయిన పూర్వపు ఏపీపీ పెద్దింటి వేణుగోపాల్ (వేణు), అలాగే రావులపాలెం మండలం కొమరాజు లంక గ్రామానికి చెందిన కర్రీ గోవింద కృష్ణారెడ్డి మరియు నార్కెడ్ మెల్లి గ్రామానికి చెందిన పాల శివ కళ్యాణిలను రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీలుగా, రావులపాలెం మండల పార్టీ అధ్యక్షుడుగా వేదిరేశ్వరం గ్రామానికి చెందిన బొక్క కరుణాకర్ నియమితులైనట్లు కోనసీమ జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## వెంకన్న భక్తుల సౌకర్యాల కల్పనే లక్ష్యం

**– దేవస్థానం పాలక మండలి మొదటి సమావేశం**



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా ముందుకు వెళతామని చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు లు అన్నారు. గురువారం దేవస్థాన పాలకమండలి సభ్యులతో మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భోగి పండుగ రోజున జరుగు గోదా కళ్యాణం మునుపటికంటే ఈసారి బాగా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఆలయంలో పలు అభివృద్ధి పనుల గూర్చి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచనల మేరకు ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామని, భక్తుల సౌకర్యాలు లక్ష్యంగా పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు శిష్ట సూర్య కుటుంబరావు, చలుమూరి రాంబాబు, గంగవరపు పద్మావతి,కాసాచాముండేశ్వరి, కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, పెండెం కుమారి, పెండ్యాల భవాని, సలాది నాగేశ్వరరావు, సరేళ్ల సరిత, ఏపుగంటి విజయకుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయి ప్రసాద్, యల్లమిల్లి సీగంద్ర కుమారి, దాలిపర్తి శ్రీలక్ష్మి, గోశాల అప్పలనరస పాల్గొన్నారు.

## వెంకన్న అన్నదాన పథకానికి విరాళం



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్యాన్నదాన పథకానికి గురువారం పామర్రు మండలం, కుందూరుకు చెందిన పామర్తి శ్రీహరి, హేమలత దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు రూ.61,420లు విరాళంగా సమర్పించారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రములు అందజేశారు. దాతలకు చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**– పంతాడి ఆంజినేయులు**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల మత్స్యశాఖ ఉపాధ్యక్షులు పం తాడి ఆంజినేయులు అన్నారు. పోలవరం జిల్లా ఎటపాక మండలం పురుషోత్త పట్నం గ్రామ పంచాయతీ శ్రీరామ్ నగర్ కాలనీ లో స్వచ్ఛ సంక్రాంతి పరిశుద్ధ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం పురుషోత్త పట్నం గ్రామ పంచాయతీ సర్పంచ్ బుద్దా ఆదినారాయణ, గుండాల యంపిటీసి గొంగడి వెంకట రామిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. శ్రీరామ్ నగర్ కాలనీలో పలు వీధులను యంత్రాల సహాయంతో శుభ్రం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పంతాడి ఆంజనేయులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటామని ఆయన అన్నారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# నిర్వాసితుల త్యాగ ఫలితమే పోలవరం




- పోలవరం నిర్వాశితులకు న్యాయం జరిగే వరకు పోరాటం
- ఈ నెల 18న జరిగే సీపీఐ శత జయంతి ముగింపు సభకు తరలి రావాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి సభ్యులు రామకృష్ణ
- గన్నవరంలో సీపీఐ శత జయంతి సభ

**ఎటపాక,మేజర్‌న్యూస్ :** నిర్వాసితుల త్యాగ ఫలితమే పోలవరమనీ సీపీఐ జాతీయ కార్యదర్శి కే.రామకృష్ణ అన్నారు. గురువారం పోలవరం జిల్లా ఎటపాక మండలంలోని గన్నవరం గ్రామంలో సీపీఐ శత వార్షిక జయంతి సభకందుకూరిస్వర్ణ,వాసంరాము అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా గన్నవరం ప్రధాన రహదారి నుంచి నుండి సభ ప్రాంగణ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం శత వార్షిక జయంతి సభ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రాంతాన్ని సస్య శ్యామలం చేసేందుకు సర్వం త్యాగం చేస్తున్న పోలవరం నిర్వాసితులకు పరిహారం ఇచ్చేంత వరకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. అందుకు నిర్వాదితులందరూ సిద్ధం కావాలన్నారు. వందేళ్ళు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. బ్రతికుంటే సీపీఐ జెండా భుజం మీద చచ్చిపోతే సమాధి మీద అని అన్నారు.నిజమైన కమ్యూనిస్టు చచ్చిపోయినా తన ఆదర్శాలు మిగులుతాయని తద్వారా కమ్యూనిజం అజరామరం అవుతుందని ఉద్ఘటించారు. ఈ నెల 18న ఖమ్మంలో జరిగే సీపీఐ శత వార్షిక ముగింపు సభకు కార్యకర్తలు, అభిమానులు అందరూ కదలి రావాలని పిలుపునిచ్చారు. ముగింపు సభను జయప్రదం చేయాలని అన్నారు. మానవ హక్కుల సాధన కోసం సమసమాజ నిర్మాణం కోసం పుట్టిన భారత కమ్యూనిస్టు పార్టీకి మరణం లేదని, భూమిపై మనిషి ఉన్నంతకాలం కమ్యూనిస్టు పార్టీ సజీవంగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు అన్నారు. పోరాటాల త్యాగ ఫలితమే సీపీఐ వందేళ్ల చరిత్ర అని జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత్ రావు, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, రాష్ట్ర సమితి సభ్యులు మునీర్, అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, ఏలూరి జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, చింతూరు డివిజన్ కార్యదర్శి గుజ్జ మోహన్ రావు, సహాయ కార్యదర్శి వాసం రాము, ఎస్కే రంజన్, గన్నవరం ఎంపీటీసీ కంటే రాజు, సర్పంచ్ గడ్డం భద్రమ్మ, కూనవరం మండల కార్యదర్శి లంబు శ్రీను, వి.ఆర్. పురం మండల కార్యదర్శి, కర్నాటి ఏసు, నాగరాజు, తూర్రం మురళి, సీనియర్ నాయకులు సూర్య చంద్రవ్రావు, వరద బ్రహ్మం, వేలేరు పాడు మండల కార్యదర్శి బాదిశా రాము, వెంకటచారి, లక్ష్మయ్య, సురేష్ బాబు, శ్యామల, డివిజన్ జుట్టుక కుమార్, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీగా శివకళ్యాణి

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీగా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి గ్రామానికి చెందిన పాల శివ కళ్యాణిని నియమించారు. పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం నుంచి ఈరోజు రాష్ట్ర లీగల్ సెల్ విభాగంలో పలువురిని నియమించారు. ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి గ్రామ సర్పంచ్ పాల నాగేశ్వరరావు భార్య శివ కళ్యాణిని పదవి వరించింది. అలాగే వెలిచేరు గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది పెద్దింటి వేణుగోపాల్ ను, రాష్ట్ర లీగల్ సెల్ జనరల్ సెక్రటరీగా రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన ప్రముఖ న్యాయవాది కర్రి వెంకట గోవింద కృష్ణారెడ్డిని రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీగా, రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామానికి చెందిన బొక్క కరుణాకరంను రావులపాలెం మండల పార్టీ అధ్యక్షులు నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర లీగల్ కమిటీలో ఎంపికైన పెద్దింటి వేణుగోపాల్, పాలా శివ కళ్యాణి, కర్రీ వెంకట గోవింద కృష్ణారెడ్డిని, రావులపాలెం మండల అధ్యక్షుడుగా నియమితులైన బొక్క కరుణాకరంను కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు అభినందించారు.



# కిట్స్ దివిలిలో వైభవంగా సంక్రాంతి సంబరాలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న డిసిసిబి ఛైర్మన్

**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** కిట్స్ (కిట్స్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఇంజనీరింగ్ కళాశాల)లో కళాశాల ఛైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామిబాబు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ మన సంప్రదాయాలను రేపటి తరాలకు అందించడం కోసమే ఈ సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరుగుతుందని, వీటిని నిర్వహించిన ఛైర్మన్ శ్రీనివాసరావును, విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్రాంతి మన తెలుగు సాంప్రదాయానికి ఒక ప్రతీక అని, సంక్రాంతి సంబరాలునిర్వహించడానికి సహకరించిన విద్యార్థులకు, అధ్యాపక బృందానికి ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కళాశాల డైరెక్టర్ బి.సృజన్ మాట్లాడుతూ ఈ సంక్రాంతి సంబరాల పట్ల విద్యార్థుల శ్రద్ధను ఆయన ప్రత్యేకంగాఅభినందించారు.ఈ కార్యక్రమం లో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ గిరిధర్, బిఫార్మసి ప్రిన్సిపల్ డా.పి.సింధు, పరిసర గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కూటమి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి బాబు ముగ్గుల పోటీలను, ఫుడ్ కాంపిటేషన్‌లను సందర్శించి విజేతలను ప్రకటించారు.





## పంచాయతీ రాజ్ వ్యవస్థ పనితీరుపై అవగాహన






**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పంచాయతీ రాజ్ వ్యవస్థ పనితీరుపై అవగాహన కలిగించేలా, పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకు క్షేత్రస్థాయి పర్యటనలు ఏర్పాటు చేయడం జరిగినట్లు సామర్లకోట విస్తరణ కేంద్రం ప్రిన్సిపల్ కె.ఎన్.వి.ప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా శిక్షణా కేంద్రం పరిధిలో 12 జిల్లాలకు చెందిన డిప్యూటీ ఎంపిడిఓలు, మండల పరిషత్ పరిపాలనాధికారులకు గురువారం 120మంది, నాలుగు బృందాలుగా కొన్ని గ్రామాలలో పర్యటించడం జరిగింది. ప్రిన్సిపల్ కె.ఎన్.వి.ప్రసాద్ నేతృత్వంలో రెండు రోజులు పాటు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మొదటిరోజు సామర్లకోట మండలం, వేట్లపాలెం, పెద్దాపురం మండలం జి.రాగంపేట, కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ, అనపర్తి మండలం రాయవరం గ్రామ పంచాయతీలలో పరిపాలనను ఈ బృందాలు పరిశీలించాయి. ఈ అధికారులు రెండవ రోజు ఆత్రేయపురం మండలం ర్యాలీ, ముమ్మిడివరం మండలం అనాతవరం, కిర్లంపూడి మండలం బూరుగుపూడి, గోకవరం గ్రామాలలో పర్యటించనున్నాయి. ఆయా గ్రామాలలోని పారిశుద్ధ్యం, రికార్డుల నిర్వహణ, ఇతర కార్యక్రమాల అమలును ఈ బృందాలు పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ జి.రమణ, ఎంపిడిఓలు శేషుబాబు, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలి - ఎస్సై మౌనిక




**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్‌పి జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు, పెద్దాపురం డిఎస్‌పి డి.శ్రీహరి రాజు సూచనల మేరకు ఎస్సై వి.మౌనిక గురువారం పెద్దాపురం పట్టణంలోని స్థానిక గరల్స్ హైస్కూల్ నందు విద్యార్థులకు లక్ష్య సాధనపై అవగాహన కార్యక్రమం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.జె.రవీంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్సై వి.మౌనిక విద్యార్థులతో మాట్లాడుతూ కెరీర్‌పై దృష్టి పెట్టాలని, అలాగే ఇప్పటినుండి బాలికలు రక్షణపై అవగాహన కలిగి ఉండాలని,చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఏకాగ్రతతో చదువుకుంటూ తల్లితండ్రులకు,ఉపాధ్యా యులకు మంచిపేరు తీసుకురావాలని ఆమె సూచించారు.ఉద్యోగ లక్ష్య సాధనపై దృష్టి సారిస్తూ ఉండాలని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకూడదని ఆమె విద్యార్థులనుద్దేశించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బోల్తా పడ్డ లారీ



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** గోపాలపురం జాతీయ రహదారిపై తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచే సుకుంది. మధ్యప్రదేశ్ నుండి కొవ్వూరు అవంతి ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ గోపాలపురం సమీపంలో ప్రమాదానికి గురైంది.ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అవగా 108 అంబులెన్స్ సహాయంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా హైవే పోలీస్ సిబ్బంది భద్రత చర్యలు చేపట్టారు.

# పి.ఆర్ ప్రభుత్వ కళాశాల ఉత్సవ వేడుక 2026లో ఆదిత్య డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థుల ప్రతిభ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)విద్యార్థులు పి.ఆర్. ఉత్సవ వేడుక 2026లో జరిగిన పోటీలలో చక్కని ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఈ ఉత్సవ వేడుకలలో భాగంగా నిర్వహించిన యాడ్ మేకింగ్, కేస్ అనాలిసిస్, బిజినెస్ క్విజ్, ప్రొడక్ట్ డిబేట్, ఫైనాన్స్ ఫెయిర్, హెచ్.ఆర్.ఈవెంట్స్ వంటి విభాగాలలో ఆదిత్య కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చేసి ఇరవై మంది విద్యార్థులు విజేతలుగా నిలవడం విశేషం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్.నాయుడు పాల్గొని మాట్లాడుతూ ఈ విధమైన అంతర కళాశాల స్థాయి పోటీలు విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీయడానికి ఉపయోగపడతాయని అన్నారు. విద్యతో పాటు విజ్ఞానం, ప్రాయోగిక నైపుణ్యాలను పెంపొందించేలా కళాశాల అందిస్తున్న విద్యా వాతావరణమే ఈ విజయాలకు కారణమని తెలిపారు. ముఖ్యంగా కామర్స్‌తో పాటు కంప్యూటర్, మేనేజ్‌మెంట్ అంశాలపై విద్యార్థులకు కల్పిస్తున్న అవగాహన వారి విజయంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. విజేతలను అభినందించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ అన్సర్ అలీ, అధ్యాపకులు అపర్ణ స్రవంతి, పి నరసింహారావు అభినందించారు.

# వాలీబాల్ పోటీలలో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

### – విజేతలను అభినందించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం, రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. విద్యార్థులలో ఉన్న క్రీడా నైపుణ్యాలను పెంపొందించాలననే ఉద్దేశంతో ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో విద్యార్థులకు వాలీబాల్ మరియు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడం జరిగింది. వాలీబాల్ పోటీలలో సిహెచ్ జగదీష్, పి నాగ సిద్దు, కే శామ్యూల్ రాజు సిహెచ్ శ్రీను, బి విష్ణు, ఎం మోహన్ కృష్ణల బృందం విజేతలుగా నిలిచి బంగారు పతకాలు సాధించగా బ్యాడ్మింటన్ పోటీలలో ఎన్ జాహ్నవి ప్రథమ స్థానంలో నిలిచి డాక్టర్ నాయుడు చేతుల మీదుగా ప్రశంస పత్రాలను మరియు బంగారు పతకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు విద్యాసంస్థల క్రీడా అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్,



రోటరాక్ట్ క్లబ్ బృందాన్ని, విజేతలను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్–ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, డి అశ్విని, వాలంటీర్లు సాద్విక్, నాని, శైలజ పాల్గొన్నారు.

# కార్యకర్త ప్రజల్లో తిరిగి వారి అవసరాలను గుర్తించండి



### – ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లో తిరిగి వారి అవసరాలను గుర్తించి తెలియజేస్తే వారికి ప్రభుత్వం ద్వారా అన్ని రకాలుగా ఆదుకుంటానన్నారు. ముఖ్యంగా, ముఖ్యమంత్రి సహాయనిధి, ఇల్లు, రోడ్లు, మౌలిక అవసరాలు గుర్తించి తెలియజేయాలని అన్నారు. 9వ తేదీన జగ్గంపేట మండలం గొల్లల గుంట, గెద్దనాపల్లి గ్రామంలో పల్లె పండుగ, ప్రజా దర్బార్, పాస్‌పుస్తకాలపంపిణీ కార్యక్రమాలు జరుగుతాయని, పదో తేదీ గండేపల్లి మండలం, గోకవరం మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని 12వ తేదీ జగ్గంపేటలో అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామని సంక్రాంతికి నిర్వహించే అన్ని కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా అందరూ సాంప్ర దాయ వస్త్రాలతో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. అదేవిధంగా ఈనెల 31వ తేదీ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఇర్రిపాక శివకేశవులు ఆలయం వద్ద అంగరంగ వైభవంగా 30 లక్షల రూపాయల ఖర్చుతో శ్రీనివాస కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాల న్నింటిలోనూ తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గంలోని నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## వాగురాముకు శిరిడి సాయి బృందం ఘన సన్మానం



**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ :** పట్టణంలోని లింగవరం కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా ఆలయ బృందం ఆలయ ఆవరణలో వాగు రామును గురువారం ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ నీలి అబ్బులు మాట్లాడుతూ శిరిడి సాయిబాబా ఆలయం అభివృద్ధి కోసం రాము ఎంతగానో కృషి చేశారని, తన వంతు సహాయ సహకారాలు అందించి మహోన్నత వ్యక్తి అని ఆయన సేవలను గుర్తించి ఘనంగా సత్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చల్ల గణేశ్వరరావు, నీలి అబ్బులు, వానపల్లి పార్వతి, కళ్యాణి, తేలు పద్మ, కే.పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

## పెరవలి ఆంజనేయ స్వామి విగ్రహ శిల్పి సాయిబాబా సంతాప సభ



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి జాతీయ రహదారి సెంటర్లో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద జనవరి 8వ తేదీ గురువారం కొత్తపల్లి అగ్రహారం గ్రామ మాజీ ఉపసర్పంచ్ ప్రముఖ విగ్రహ శిల్పి స్వర్గీయ బండారు సాయిబాబా సంతాప సభ నిర్వహించడమైనది. స్వర్గీయ సాయిబాబా శ్రీ అభయాంజనేయ స్వామి 36 అడుగుల విగ్రహాన్ని సుమారు 35 సంవత్సరాల క్రితం అభయాంజనేయ స్వామి వారి విగ్రహాన్ని ఉచితంగా నిర్మించారు. మండల కేంద్రమైన పెరవలిలో స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఉచితంగా ఇచ్చి తన ఉదారతను చాటుకున్నారు. అదే విధంగా కొన్ని గ్రామాల్లో ఉచిత విగ్రహాలు ఇచ్చి ప్రజల మన్ననలు పొందినారు. ఆయన సేవలకు గుర్తు చేసుకుంటూ గురువారం పెరవలి సెంటర్లో మాజీ తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు సలాది కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ బొడ్డు రామాంజనేయులు, సత్తిరాజు, సాయిబాబా కుమారులు మండల తెలుగు యువత అధ్యక్షులు బండారు బాబి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శేషపు అప్పారావు, పెరవలి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు గుడివాడ బాలకృష్ణ, స్థానిక వర్తక సంఘం సభ్యులు పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మాధురి స్కూల్‌లో అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు





**శంఖవరం,మేజర్‌న్యూస్:** విద్యార్థుల కేరింతలు, హరిదాసుల వేషాలు, గొబ్బెమ్మ పాటలు, బసవన్న రంకెలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునే విధంగా అంగరంగవైభవంగా సంక్రాంతి సంబరాలు మాధురి విద్యాలయం నందు జరిగాయి. మండలంలోని కత్తిపూడి గ్రామంలో గల మాధురి విద్యాలయం నందు సంక్రాంతి సెలవులు నేపథ్యంలో ముందస్తుగానే సంక్రాంతి సంబరాలు పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఆటపాటలతో, సంస్కృతి, సంప్రదా యాలు ఉట్టి పడేలా వేడుకలను యాజమాన్యం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కడారి తమ్మయ్య నాయుడు మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతిని చాటిచెప్పే పండుగల్లో సంక్రాంతి ఒకటని, ఈ వేడుకలను ప్రతీ ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోప్రిన్సిపాల్ఆదినారాయణ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'శ్రీ అగస్త్య'లో ఆనందోత్సాహాల నడుమ ఫుడ్ ఫెస్టివల్





కాకినాడ, మేజర్ న్యూస్ : నిత్యం చదువులతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఆహ్లాదం పంచేందుకు గాను గురువారం ఉదయం స్థానిక శాంతినగర్‌లోని శ్రీ అగస్త్య స్కూల్ వశిష్ట క్యాంపస్‌లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. శ్రీ అగస్త్య విద్యాసంస్థల కరస్పాండెంట్ డి.నాగేశ్వరరావు (డిఎన్ఆర్) అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి కౌస్తుభ హోటల్ మేనేజర్ యు.రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ శ్రీఅగస్త్యపాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు పిల్లలను ఉత్తేజపరిచేలా నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇక్కడి ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను చూస్తే తన చిన్ననాటి రోజులు గుర్తుకువస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ డి.నాగేశ్వరరావు (డిఎన్ఆర్) మాట్లాడుతూ సంక్రాంతివేడుకలు శ్రీఅగస్త్యలో ముందుగానే వచ్చాయన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో వంటలకు ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందని, దానిలో భాగంగా మన విద్యార్థులకు తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేలా ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు.

ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన విద్యార్థులకు,తల్లిదండ్రులకు, ఉపాధ్యాయు లకు, నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పోలీసు ఉద్యోగి భాస్కర్, శ్రీ అగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డి.పల్లవి, జోనల్ ప్రిన్సిపాల్ సురేష్, క్యాంపస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, అకౌంటెంట్ అల్లుమల్లు ఏలియా, బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు వరం

**– జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని, పేద కుటుంబాలు వైద్యకోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. స్థానిక రావులమ్మ నగర్ లోని టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సాయం మంజూరు అవుతుందని అన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు మాట్లాడుతూ పేదవారికి ఆరోగ్యశ్రీ వర్తించని కొన్ని రకాల అనారోగ్యాలకు, ఆపరేషన్లకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు జ్యోతుల నవీన్ చేతుల మీదుగా జగ్గంపేట నియోజకవర్గంలోని 4 మండలాలకు సంబంధించి 50 మందికి రూ. 38,58,671 లక్షల సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ముఖ్యంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కులం, మతం, పార్టీలకు రహితంగా అందరికీ ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులు రాష్ట్రంలోనే నియోజకవర్గంలో ఎక్కువగా తేవడం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో జగ్గంపేట నియోజకవర్గం అన్ని రంగాలను అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని పోతుల మోహనరావు అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు పిఠాపురంలో... పవన్ కళ్యాణ్ పర్యటన

**– పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**– మొదటి రోజు సంక్రాంతి వేడుకల్లో పాల్గొననున్న ఉపముఖ్యమంత్రి**



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాల సందర్భంగా...నేడు పిఠాపురంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారు. నియోజకవర్గంలో రూ.212 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయను న్నారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.4.03 కోట్ల అభివృద్ధి పనులను, గొల్లప్రోలు పరిధిలోరూ. 80.02లక్షలవిలువైన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

**-ప్రారంభోత్సవాలు...పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో...**

రూ.12.46 కోట్లతో నిర్మించిన 41 ఎన్ఆర్జిఎస్ పీఆర్ రోడ్లు, రూ. 2.95 కోట్లతో నిర్మించిన పిఠాపురం 33/11 విద్యుత్ సబ్ స్టేషన్, రూ. 1.35 కోట్లతో పిఠాపురంలో నిర్మించిన పశువుల సంత, రూ.3.05 కోట్లతో గొల్లప్రోలు హౌసింగ్ కాలనీ వద్ద నిర్మించిన సుద్దగడ్డ బ్రిడ్జి, రూ. 27 లక్షలతో గొల్లప్రోలు వద్ద నిర్మించిన సూరంపేట బ్రిడ్జి, రూ. 1.16 కోట్లతో గొల్లప్రోలు జడ్పీ హైస్కూల్ మరియు పిఠాపురం ఎస్బిఎంఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పీఎంశ్రీ ల్యాబ్ లను ఆయన ప్రారంభిస్తారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.6.05 కోట్లతో చేపట్టే సీసీ డ్రైన్లు, మోడల్ రోడ్డు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు.

**-శంకుస్థాపనలు...**

రూ.9.60 కోట్లతో చేపట్టే ఎపిఐఐసి ప్లాటేడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేస్తారు. రూ.2 కోట్లతో కోనపాపపేట వద్ద నిర్మించే కోస్టల్ రీ సైలెన్స్ పథకం, పిఠాపురం నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం క్రింద రూ.31.22 కోట్లతో చేపట్టిన 178 పశువుల షెడ్లు, 12 హెల్త్ క్లినిక్‌లు, రెండు గ్రామ పంచాయితీ భవనాలకు శంకుస్థాపన చేస్తారు.

గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో రూ.3 కోట్లతో చేపట్టే సీసీ డ్రైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో సిజిఎఫ్ గ్రాంటు క్రింద రూ.14.05 కోట్లతో వివిధ ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అదే విధంగా రూ.92.34 కోట్లతో పంచాయతీ రాజ్, డ్వామా ఆధ్వర్యంలో ఎపీఆర్ఆర్ఎస్పి గ్రాంటు క్రింద చేపట్టే గ్రామీణ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మొదటి రోజు సంక్రాంతి వేడుకల్లో పాల్గొంటారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు






**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు గురువారం నాడు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ముందుగా కళాశాల ప్రాంగణంలో భోగి మంటలు వేసి సంక్రాంతి పాటలు పాడుతూ విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలను నిర్ణయించుటకు న్యాయ నిర్ణేతలుగా కళాశాల ప్రిన్సిపాల్ కే.రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ కే.గణేశ్వరరావు లు పాల్గొని ముగ్గులు బాగా వేసినవారిని విజేతలుగా నిర్ణయించడం జరిగింది. మొదటి బహుమతి కుంజా కల్యాణి, ద్వితీయ బహుమతి పి.సాయి మేఘన, తృతీయ బహుమతి శ్వేత లను విజేతలుగా నిర్ణయించారు. అంతేకాకుండా ముర్రం సీతాలక్ష్మ, ప్రవళిక మరియు సత్యలకు కన్సలేషన్ బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది అప్పల నాయుడు, భూలక్ష్మి, దుర్గా ప్రసాద్, సుశీల, రాము, శివయ్య, విజయలక్ష్మి, సాయి చంద్రిక, చంద్రశేఖర్, సూర్య నారాయణ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కాలినడకన కలెక్టర్ ...

**– పవన్ కళ్యాణ్ పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ అపూర్వ భరత్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** సంక్రాంతి సంబరాల్లో భాగంగా పిఠాపురంలో నేటి నుండి మూడు రోజుల పాటు జరగనున్న పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలకు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ హాజరుకానున్న నేపథ్యంలో గురువారం ఉదయం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులతో కలిసి ఆయా శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిం చారు. పిఠాపురం రోడ్డు భవనాల అతిథి గృహం నుంచి కుక్కుటేశ్వర స్వామి దేవాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రం మీదుగా రోడ్డు మార్గంలో కాలి నడకన సంక్రాంతి సంబరాలు జరగనున్న ఆర్ .ఆర్.బి.హెచ్‌ఆర్ కళాశాల గ్రౌండ్‌కు ట్రైల్ వాక్ నిర్వహించారు. అక్కడ జరుగుతున్న సభా వేదిక, స్టాల్స్, సాధారణ ప్రజలు, వీఐపీలు ప్రవేశించే మార్గం, పీఏ సిస్టం ఇతర ప్రదేశాలను పరిశీలించారు. అక్కడ నుంచి పాడా కార్యాలయానికి చేరుకుని, రానున్న మూడు రోజులు పాటు అధికారులు నిర్వర్తించాల్సిన విధులపై ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి మహోత్సవాలు విజయవంతం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటనలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట రావు, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు, ఎస్ మల్లి బాబు, కె. శ్రీరమణి, హౌసింగ్ పీడీ ఎన్వీవీ. సత్యనారాయణ, ఆర్ అండ్ బీ ఎస్ఈ జీ.కాంతు, పాడా పీడీ ఎ.శ్రీనివాసరావు, సమాచార పౌర సంబంధాల శాఖ ఏఈఐఈ సీ.బాబురావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.